క్లుప్తంగా

డ్వాక్రా మహిళలకు ముగ్గుల పోటీలు



కంచికచర్ల: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం డ్వాక్రా సంఘాలను నెలకొల్పి వారి ఆర్థిక ఉన్నతికి ఎంతగానో కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. కంచికచర్ల వెలుగు కార్యాలయంలో బుధవారం డ్వాక్రా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముందుగా మహిళలు వేసిన పలు రంగవల్లులను ఆమె తిలకించారు. అనంతరం ముగ్గులపోటీలో మొదటి బహుమతి మారం లక్ష్మి, ద్వితీయ బహుమతి వి.దీపిక, తృతీయ బహుమతి ఎం.నాగమణిలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వెలుగు పీడీ కె.శ్రీనివాసరావు, ఏపీఎం శ్రీనివాసరావు, పేరకలపాడు సర్పంచి సాత్విక, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ముక్కోటి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం

పెనుగంచిప్రోలు: ముక్కోటి ఏకాదశి సందర్భంగా జనవరి 10వ తేదీ ఉదయం 4.50 గంటల నుంచి గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6.16 గంటల నుంచి గ్రామోత్సవం ఉంటుందన్నారు. గురువారం రాత్రి ఆలయం వద్ద పూజలు, జాగరణ, భజనలు ఉంటాయన్నారు. భక్తులు, దీక్షాస్వాములు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

నందిగామటౌన్: వ్యవసాయ భూములకు సంబంధించిన రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తహసీల్దార్ సురేష్‌బాబు కోరారు. మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ఈ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. అనంతరం పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లగడపాటి పుష్పరేణి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం

నందిగామటౌన్: మద్యం అక్రమ రవాణా చేసినా విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ అన్నారు. మండలంలోని పెద్దవరం గ్రామంలో బుధవారం ఆకస్మిక దాడులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన రామిశెట్టి రాము, శెట్టి వెంకట రమణ ఇళ్లలో దాడులు చేసి 173 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇరువురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు రామశేషయ్య, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పోచంపల్లిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

జగ్గయ్యపేట: మండలంలోని పోచంపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం ఐదు గంటలకు గ్రామంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ స్థాయి కార్యకర్తల సమావేశం జరుగుతుందని మండల కన్వీనర్ బూడిద నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో గ్రామ కన్వీనర్ ఎన్నికతో పాటు పలు విభాగాల కమిటీలకు ఎన్నిక జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల సమస్యల పరిష్కారానికి కృషి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో కార్యకర్తలకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఫస్ట్ ఎయిడ్ కిట్‌లను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లోని కేంద్రాలకు భవనాలు లేవని, భవనాలున్న కేంద్రాల్లో మౌలిక వసతులు లేవని, వాటి కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో లక్ష్మీభార్గవి, సూపర్‌వైజర్ నాగమణి, నాయకులు కట్టా నరసింహారావు, ఆచంట సునీత తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నందిగామటౌన్: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించే ఆర్థిక సహకారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. ఎనిమిది మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.7.24 లక్షల విలువ గల చెక్కులను పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందన్నారు.

చెత్త డంపింగ్‌తో విలియంపేట వాసుల కష్టాలు

- స్థలం కొనుగోలు చేస్తున్నామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా అతీగతిలేదు
- తరచూ చెత్త గుట్టలను దగ్ధం చేస్తుండటంతో భరించలేని పొగ
- శాశ్వత ప్రాతిపదికన డంపింగ్ యార్డు లేని పురపాలక సంఘం

జగ్గయ్యపేటఅర్బన్: పేట పురపాలక సంఘం వారికి చెత్త డంపింగ్ సమస్య శిరోభారంగా మారింది. స్థిరంగా శాశ్వత ప్రాతిపదిక ఒక డంపింగ్ యార్డు అంటూ లేదు. దీంతో పట్టణంలోని 31 వార్డుల్లో సేకరించిన చెత్త, వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బంది తీసుకువచ్చి ముక్త్యాల రోడ్‌లో విలియంపేట–పద్మావతినగర్‌ల మధ్య పలు సామాజిక వర్గాలకు చెందిన శ్మశానవాటికలకు ఆనుకుని రోడ్డు పక్కన పాలేటి నది ఒడ్డున కుప్పలుగా పడవేస్తున్నారు. జనావాసాల మధ్య చెత్త డంపింగ్ చేయడం వల్ల విలియంపేట, పద్మావతినగర్ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతంలో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వ్యర్థాల నుంచి వెలువడుతున్న దుర్గంధంతో అక్కడ నివసించలేకపోతున్నామని పరిసర ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే పాలేటి నది ఒడ్డునే ఈ డంపింగ్ యార్డు ఉండటంతో పాలేటిలో నీరు కలుషితం అవుతుందని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా విలియంపేటలోని శ్మశానవాటికలో చెత్తను డంపింగ్ చేస్తుండటంతో దహన సంస్కారాలు చేసేందుకు శ్మశానవాటికకు వచ్చేవారికి ఇబ్బందిగా ఉంది. పలుమార్లు మున్సిపల్ సిబ్బంది చెత్తను దగ్ధం చేస్తుండటంతో తరచూ వచ్చే పొగ ఆ ప్రాంతంలో వ్యాపించడంతో ముక్త్యాల–జగ్గయ్యపేట రోడ్‌లో దారి సరిగా కనిపించక వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం 60 వేలకు పైగా ఉన్న పట్టణ జనాభా రోజురోజుకు పెరిగిపోతుండటంతో చెత్త సేకరణ, నిర్వహణ భారం పెరిగిపోయింది. దీంతో రోజుకు 18 నుంచి 25 టన్నుల వరకు చెత్త సేకరణ జరుగుతుంది.



ముక్త్యాల రోడ్డులో విలియంపేట వద్ద రోడ్డు పక్కనే పడవేసిన చెత్తకుప్పలు



ముక్త్యాల రోడ్‌లో చెత్త డంపింగ్ యార్డులో తరచూ ఎగసిపడుతున్న మంటలు

పొగ భరించలేకపోతున్నాం



ముక్త్యాల రోడ్డులో రోడ్డు పక్కనే శ్మశాన స్థలంలో చెత్త వేస్తుండటంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. దుర్వాసనతో పాటు దోమలు, పందుల బెడద ఎక్కువై డెంగీ, గున్యా వంటి వ్యాధులు వస్తున్నాయి. మున్సిపాలిటీ వారు తరచూ దగ్ధం చేస్తుండటంతో పొగ కారణంగా ముక్త్యాల రోడ్‌లో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి చెత్త డంపింగ్‌ను వేరే ప్రాంతానికి తరలించాలి.

–నగిరికంటి శామ్యూల్, విలియంపేట

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ప్లాంటును ఏర్పాటుచేస్తాం



సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ద్వారా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి ఒక ప్లాంటు ఏర్పాటుచేస్తే ఈ సమస్యను అధిగమించవచ్చు. తడి చెత్తను, పొడి చెత్తను వేరు చేసి లెగసీ వేస్ట్ ప్రాసెస్ ప్రక్రియ ద్వారా రీసైక్లింగ్ చేస్తూ స్థలాన్ని ఖాళీగా చూపిస్తారు. తడి చెత్తను పొలాలకు ఎరువుగా ఉపయోగిస్తారు. పొడి చెత్తను కంపోస్టు ఎరువుగా తయారుచేస్తారు. అప్పుడు ఎవరికీ ఎటువంటి ఇబ్బంది ఉండదు.

–ఎం.రామ్మోహనరావు, మున్సిపల్ కమిషనర్

ఉద్యోగం పేరుతో రూ.10 లక్షలు కాజేశారు!

దివ్యాంగురాలిని మోసం చేసిన మహిళా కండక్టర్

వత్సవాయి: వైద్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి దివ్యాంగురాలిని మోసం చేసి పది లక్షల రూపాయలు తీసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రం వత్సవాయి గ్రామానికి చెందిన దివ్యాంగురాలు ఏసుపోగు జఘునమ్మ డిగ్రీ చదివి ఖాళీగా ఉంటోంది. జఘునమ్మకు జగ్గయ్యపేటకు చెందిన ఆర్టీసీ మహిళా కండక్టర్ కవితతో పరిచయం ఉంది. దీంతో ఆమె తనకు కూడా ఉద్యోగం కావాలని చెప్పడంతో కవిత తనకు విజయవాడలో తెలిసిన వారు ఉన్నారని వాళ్లు చాలా ఉద్యోగాలు ఇప్పిచ్చారని, కానీ కొంచెం ఖర్చు అవుతుందని చెప్పడంతో ప్రభుత్వ ఉద్యోగం వస్తుందనే ఆశతో జఘునమ్మ డబ్బులు ఇచ్చేందుకు ఒప్పుకుంది. వైద్యశాఖలో ఉద్యోగం అని చెప్పి విజయవాడకు చెందిన జక్కా రాఘవేంద్ర, పవన్‌లను పరిచయం చేసింది. వారి మాటలను నమ్మిన జఘునమ్మ రూ.10.50 లక్షలు ఇచ్చింది. అయితే ఉద్యోగం కోసం అడుగుతుంటే కవిత సమాధానం చెప్పకుండా దాటవేస్తూ వచ్చింది. విజయవాడకు చెందిన రాఘవేంద్ర, పవన్‌లు ఫోన్‌లు ఎత్తడం లేదు. దీంతో సదరు బాధితురాలు విజయవాడలోని సీపీ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసింది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేశారు. ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బులు దండుకున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పేట విద్యార్థుల ప్రతిభ

జగ్గయ్యపేటఅర్బన్: ఈ నెల 7,8 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో జగ్గయ్యపేటకు చెందిన జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఆ పాఠశాలకు చెందిన 10 వ తరగతి విద్యార్థులు ఎం.నాగతేజ, వై.భార్గవ ధనుష్ గైడ్ టీచర్ జి.చంద్రశేఖర్ పర్యవేక్షణలో తయారుచేసిన ప్రొటెక్టింగ్ వెహికిల్స్ అండ్ బ్రిడ్జెస్ ఫ్రమ్ ఫ్లడ్స్ అనే ప్రాజెక్టు అవార్డు గెలుచుకుంది. ఈ నెల 20 వ తేదీ నుంచి పాండిచ్చేరిలో జరిగే సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో మన రాష్ట్రం తరఫున పాల్గొనేందుకు ఎంపిక అయింది. ఈ సందర్భంగా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు వారికి జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నాగతేజ, ధనుష్, టీచర్ చంద్రశేఖర్‌లను డీఈవో సుబ్బారావు, హెచ్‌ఎం అనంతుల మాధవీలత అభినందించారు.



సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన విద్యార్థులు నాగతేజ, ధనుష్, గైడ్ చంద్రశేఖర్

గోకులం షెడ్డులను సద్వినియోగం చేసుకోవాలి

నీటి యాజమాన్య సంస్థ జిల్లా పీడీ రాము

కంచికచర్ల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పశు పోషకులకు గోకులం షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తారని, ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.రాము అన్నారు. మండలంలోని గండేపల్లి, పరిటాల, కునికెనపాడు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన గోకులం షెడ్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ మేరకు పీడీ మాట్లాడుతూ జిల్లాలో 523 గోకులం షెడ్లు మంజూరయ్యాయని, వాటిలో 313 షెడ్లు పూర్తయ్యాయని, మిగిలిన షెడ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. నాలుగు గేదెల షెడ్డుకు రూ.1.80 లక్షలు, ఆరు గేదెల షెడ్డు నిర్మాణానికి రూ.2.30 లక్షల నిధులు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరవుతాయన్నారు. గోకులం షెడ్లు పూర్తి చేసుకున్న రైతులకు వారి బ్యాంకు ఖాతాలో నగదు జమ అయిందన్నారు. మిగిలిన పాడి రైతులు గోకులం షెడ్డులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. పశువుల షెడ్లతో పాటు ఐదు ఎకరాల లోపల ఉన్న సన్న, చిన్నకారు రైతులు 10 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు విస్తీర్ణంలో గడ్డి పెంపకం సాగు చేసుకోవడానికి నిధులు కేటాయిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ బి.శ్రీనివాసరావు, ఏపీఓ రమాదేవి, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.



కునికెనపాడులో రైతు నిర్మించిన గోకులం షెడ్డును పరిశీలిస్తున్న పీడీ రాము, అధికారులు

చెన్నకేశవస్వామి ఆలయంలో మంగళా శాసన పాశురం

జగ్గయ్యపేటఅర్బన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీ గోదా భూ సమేత చెన్నకేశవ స్వామి వారి ఆలయంలో బుధవారం స్వామి వారికి మంగళా శాసన పాశురం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి గోదా అమ్మవారు మంగళా శాసన పాశురం నిర్వహించిన రోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి యేటా ఆలయంలో ఒక దేవతామూర్తిని ఆలయం ఆవరణలో ప్రతిష్ఠించడం జరుగుతున్న క్రమంలో భాగంగా ఈ ఏడాది ఆలయ ఆవరణలో శ్రీనారసింహ స్వామి రూపాన్ని ముగ్గుతో చిత్రించి చుట్టూ దీపాలు వెలిగించారు. అక్కడ ఉన్న నారాయణ స్థూపం, ధ్వజ స్తంభం, ఆలయం చుట్టూ దీపాలంకరణ చేశారు. ఆ దీపాల వెలుగులో పెరుమాళ్లకు మంగళా శాసన పాశురం నిర్వహించారు. శ్రీభగవద్రామానుజ గోష్ఠి సభ్యులు, శ్రీచెన్నకేశవ సేవా బృందం వారు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



శ్రీనారసింహస్వామి వారి చిత్రం వద్ద మంగళా శాసనం పాశురం నిర్వహిస్తున్న భక్త బృందం

కోడి పందేలను అరికడదాం



చిల్లకల్లు(జగ్గయ్యపేట): సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో నిర్వహించే కోడి పందేలను అరికట్టాలని ఎంపీడీవో నితిన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కోడి పందేలపై పోలీస్, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట ప్రాంతం తెలంగాణకు సరిహద్దుగా ఉండటంతో పండుగ నాలుగు రోజులు కోడి పందేలు నిర్వహించే అవకాశం ఉందని, గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, రెవెన్యూ, పోలీస్ అధికారులు ప్రజలకు అవగాహన కలిగించి కోడి పందేల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా మండలంలోని అనుమంచిపల్లి, షేర్‌మహ్మద్‌పేట, వేదాద్రి, అన్నవరం, బూదవాడ, ముక్త్యాల, చిల్లకల్లు గ్రామాల్లో విస్తారంగా పందేలు జరుగుతాయన్నారు. గ్రామాలలో ఏర్పాటు చేసే బరులను గుర్తించి పోలీసులకు సమాచారం అందించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, ఎస్ఐలు తోట సూర్య శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ పద్మావతి, కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా హారతి పట్టు సేవ



జగ్గయ్యపేటఅర్బన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని రంగనాయకస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి హారతి పట్టు సేవను నిర్వహించారు. చారిత్రక ప్రాశస్త్యం గల శ్రీరంగనాయకస్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీరంగనాథునికి గోదా అమ్మవారు హారతిని ఇచ్చే వేడుక హారతి పట్టు సేవను విశేషంగా నిర్వహించారు. తిరుప్పావై, విష్ణుసహస్ర నామాన్ని పఠించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీరంగనాథుని, గోదా అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకారాలను, పూజలను నిర్వహించారు.

దివ్యాంగ పింఛన్ లబ్ధిదారుల పరిశీలన

జగ్గయ్యపేట: మండలంలోని గౌరవరం, పోచంపల్లి, బండిపాలెం, చిల్లకల్లు, షేర్ మహ్మద్‌పేట గ్రామాల్లో బుధవారం వైద్యాధికారులు వికలాంగ పింఛన్ లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం నుంచి పింఛన్ పొందుతున్న వారి అర్హతను పరిశీలించారు. కార్యక్రమంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రి వైద్యులు జ్యోత్స్న, విభారి, సంపత్ బెనర్జీ, ఎంపీడీవో నితిన్, బూచవరం వైద్యాధికారులు కీర్తిరెడ్డి, అనిల్‌కుమార్, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- పెద్ద తిరునాళ్ల, కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలి
- నందిగామ ఆర్డీఓ బాలకృష్ణ

పెనుగంచిప్రోలు: అధికారులు బాధ్యతగా, సమన్వయంతో పనిచేసి శ్రీతిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల, కల్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ అన్నారు. ఫిబ్రవరి 11 నుంచి 15 వరకు జరిగే అమ్మవారి పెద్ద తిరునాళ్లకు సంబంధించి బుధవారం ఆలయ ఆవరణలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఉత్సవాలపై ఆలయ అధికారులు స్క్రీన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఉత్సవాల్లో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వటంతో పాటు తాగునీటికి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఫిబ్రవరి 11 న జరిగే అమ్మవారి కల్యాణానికి సంబంధించి భక్తులు పెద్ద సంఖ్యలో రానున్న సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. బారికేటింగ్ పటిష్టంగా ఉండాలన్నారు. ఉత్సవాలు జరిగే 5 రోజులు 24 గంటలూ విద్యుత్ సరఫరా ఉండాలని విద్యుత్ సిబ్బందికి సూచించారు. అనధికారికంగా ఆలయ ప్రాంగణంలో పాకలకు కరెంట్ ఏర్పాటు చేసుకుంటే వెంటనే తొలగించాలన్నారు. ఐదు రోజుల పాటు ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారి సుజనకు సూచించారు. దీక్షాస్వాములు స్నానాలు చేసే చోట, అన్నదానం ఏర్పాటు చేసే స్థలంలో, పార్కింగ్ వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ అధికారులకు సూచించారు. ప్రతిచోట భక్తులకు తెలిసే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.



కల్యాణం జరిగే స్థల పరిశీలనలో ఆర్డీఓ బాలకృష్ణ, పక్కన ఏసీపీ తిలక్,ఆలయ ఈఓ, చైర్మన్ తదితరులు

సెక్టార్లుగా విభజించి బందోబస్తు

నందిగామ ఏసీపీ ఏబీజీ తిలక్ మాట్లాడుతూ ఉత్సవాలకు సంబంధించి బందోబస్తును సెక్టారులుగా విభజించి భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. గత ఉత్సవాల్లో లాగా అధికారులు అందరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఆలయ ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్, ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 11 న అమ్మవారి కల్యాణంతో పాటు దీక్షాస్వాముల తిరుముడి కార్యక్రమం ఉంటుందన్నారు. 12న జలబిందెల కార్యక్రమం, 13,14 తేదీల్లో అంకమ్మవారికి క్రతువులు, 15న న పూర్ణాహుతితో పెద్ద తిరునాళ్లు ముగుస్తాయన్నారు. అనంతరం కల్యాణం జరిగే స్థలాన్ని పరిశీలించి ఆర్డీఓ పలు సూచనలు చేశారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి, ఎంపీడీఓ జి.శ్రీను, ఆలయ ఈఈ ఎల్.రమ, జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు, పీఆర్ డీఈ శ్రీనివాస్, ఎస్ఐ అర్జున్, వివిధ శాఖల అధికారులు, పాలకవర్గ సభ్యులు, ఏఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహించటం చట్టరీత్యా నేరం

కంచికచర్ల: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని గ్రామాల్లో కోడి పందేలు, క్యాసినో, జూదం వంటివి నిర్వహిస్తే కేసు నమోదు చేస్తామని తహసీల్దార్ పి.జాహ్నవి హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా జూదం, పేకాట, కోడి పందేలు, క్యాసినో ఆటలు నిర్వహించరాదన్నారు. బరులు నిర్వహించి కోడి పందేలు నిర్వహించిన వారిపై సెక్షన్ 10 గ్యాంబ్లింగ్ యాక్ట్, సెక్షన్ 34 జంతు హింస నివారణ చట్టం ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని అన్నారు. పేకాట, కోడి పందేల నిరోధానికి రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, పశు సంవర్ధకశాఖ అధికారులతో కమిటీ ఏర్పాటుచేశామన్నారు. ఏ గ్రామాల్లోనైనా పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే తమ కార్యాలయానికి గానీ, పోలీస్ శాఖకు గాని సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు, మండల పశువైద్యాధికారి వి.విజయ్ డీటీ మానస, ఆర్ఐ వెంకట్, వీఆర్వోలు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ జాహ్నవి, ఎంపీడీఓ విజయలక్ష్మి

పేదల నడ్డి విరుస్తున్న విద్యుత్ చార్జీలు

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

వీరులపాడు: కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తోందని సీపీఎం నాయకుడు వట్టికొండ చంద్రమోహన్ అన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం వీరులపాడు గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022, 2023, 2024 ఏళ్లకు సంబంధించిన అదనపు భారాన్ని బిల్లుల రూపంలో పేదలపై మోపటం బాధాకరమన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచం.. అవసరమైతే తగ్గిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నెలల వ్యవధిలోనే ఇచ్చిన హామీని విస్మరించి విద్యుత్ బిల్లులు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోదూరి పిచ్చేశ్వరరావు, చాట్ల రవి, గద్దం ప్రభాకర్, వట్టికొండ రమేష్, వట్టికొండ భగీరథ, అద్దంకి రవీంద్ర, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వీరులపాడులో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

వీరులపాడు: ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఉమ్మడి కృష్ణాజిల్లా ఎయిడెడ్ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు మోహన్ వెంకటకృష్ణ అన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో ఎయిడెడ్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉపాధ్యాయులతో కలిసి బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలో ఎయిడెడ్ పాఠశాలలను విలీనం చేయటంతో ఉపాధ్యాయులకు రావాల్సిన సర్వీసు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,232 మంది ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలలో సర్వీస్ జీరో అవటంతో దూర ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని విద్యాశాఖా మంత్రి దృష్టికి తీసుకెళ్లినా సర్వీస్‌పై ఎటువంటి జీవో విడుదల చేయలేదని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యాయులు కొణతం సుబ్బారావు, ఆదిరాజు వెంకటరావు, సీతారామ్మూర్తి, సత్యానందం, పూల వెంకటేశ్వరరావు, జ్యోత్స్న, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల హైస్కూలుకు కుర్చీల వితరణ

జగ్గయ్యపేటఅర్బన్: రామ్‌కో సిమెంట్స్‌కు సంబంధించిన రామ్‌కో లేడీస్ క్లబ్ వారు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూలుకు 20 కుర్చీలను బహూకరించారు. రామ్‌కో సిమెంట్స్ వైద్యుడు రాజా కేశవప్రసాద్ సహకారంతో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో రామ్‌కో లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు మమతా శ్రీవత్సవ, కార్యదర్శి అరుణామూర్తి, సభ్యులు రత్నమాల ప్రసాద్, మాధవి రెడ్డి, లక్ష్మీశ్రీనివాస్, చందన గుప్త పాల్గొన్నారు. పాఠశాల హెచ్‌ఎం అలవాల లక్ష్మి, ఉపాధ్యాయ బృందం వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.



కుర్చీల అందజేత కార్యక్రమంలో పాల్గొన్న రామ్‌కో లేడీస్ క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

రంగవల్లిలో కృష్ణ భగవానుడు

ధనుర్మాసం సందర్భంగా పట్టణంలోని కృష్ణ మందిరంలో రంగవల్లులతో తీర్చిదిద్దిన కృష్ణుడు ముగ్గు ఆకట్టుకుంది. పట్టణానికి చెందిన అలాసపురి యామిని ముగ్గులో కృష్ణుని ప్రతిమను అందంగా రూపొందించారు.

–జగ్గయ్యపేట



రంగవల్లులతో తీర్చిదిద్దిన కృష్ణుడి చిత్రం